ఈవారం కథ

# ఉప్పు-కర్పూరం

**– జె. సువర్ణలత**

ఉదయం వేళేమో, లాంచీ అంతా హడావుడిగా నిండుగా వుంది. కూరల తట్టలు, పూల బుట్టలు, పాల బిందెలు, అరటిగెలలు, ఇవన్నీ రాజమండ్రి మార్కెట్‌కి చేరుకుంటాయి.

మాది బొబ్బర్లంక. ఏం కావాలన్నా రాజమండ్రికే వస్తాము. చోటుకోసం చూసుకుంటూంటే చుక్కల్లో చంద్రుడిలా ఆ అమ్మాయి కనబడింది. కాలేజీకి వెళ్ళి చదువుకుంటూందన్న సంగతి తెలుస్తూనే వుంది. మంచి బట్టలు. గొప్పింటి పిల్లలా వుంది. ముఖ్యంగా ఓ రకమైన స్టయిల్‌తో కూడిన మేనరిజమ్స్. గులాబీ రంగు ఆర్గండీ చీర చాలా శ్రద్ధగా, నీట్‌గా కట్టుకుంది. కాస్త వంగితే అలల అంచున వజ్రాల పలుకులు దొర్లిస్తూ గోదారి ... ఆమె నీళ్లల్లో చెయ్యిపెట్టి, ఆనందిస్తూంది. కాసేపైన తర్వాత చెయ్యి లోపలికి లాక్కుని, ఎంతో జాగ్రత్తగా పెంచుతున్న 'కోన్' ఆకారంలో వున్న గోళ్ళని మృదువుగా చేతిరుమాలుతో అద్దుకుంది. మెడలో గొలుసుని వేళ్లమధ్యకి తీసుకుని, మునిపంటితో సున్నితంగా కొరకటం, ముంగురులు సవరించుకోవడం... అద్భుతంగా వున్నాయామె కదలికలు.

ఆమె తప్ప మిగిలినదంతా నాటుసరుకే. కొన్ని జాకెట్లు వేసుకోని తూర్పువైపు శాల్తీలు.

పీచుమిఠాయి రంగు చీర కట్టుకున్న కొత్త పెళ్ళికూతురు సిగ్గుగా తలవంచుకుని కూర్చుంది. భర్త షర్బత్ బండి దగ్గర షర్బత్ పట్టుకొచ్చి, తాగమని బ్రతిమలాడుతుంటే, పక్కనే కూర్చున్న ముదురు శాల్తీతో "వద్దని సెప్పక్కా" అని సిగ్గుగా బ్రతిమలాడుకుంటోంది.

లాంచీ కదిలింది. కాసేపు సాగిందో, లేదో పెద్ద కలకలం.

"ఓలమ్మో ... నా పదిరూపాయల నోటు పడిపోనాది. టికెటీకి డబ్బులు నేనెక్కడ్నించి తేను? పభో రామసెంద్ర పభో నా పది రూపాయలు దొరికేటట్లు సెయ్యి నాయనా" గోల గోలగా పాలబిందె ముసలమ్మ కేకలు, ఏడుపులు.

"డబ్బులు పోయి నేనేడుస్తుంటే 'టికిటీ..టికిటీ' అంటావేటయ్యా? ఓలమ్మో... పది రూపాయలు ... కొట్టేసిన దొంగెదవ కాళ్ళు పడిపోను."

"శాపనార్థాలు కట్టిపెట్టి ఎతకవమ్మా" అన్నారెవరో.

"ఈ ముసిల్ది పది రూపాయలకోసం మనందర్నీ 'సెర్చ్' చెయ్యదుకదా?" ఓ స్టూడెంట్ వ్యాఖ్యానానికి ఆ అమ్మాయి పెదవులు విడీవిడకుండా నవ్వడం.

"రెండుంపావలా బేగియ్యి."

"నీ గోల సంతకెల్ల ... నేనెక్కడ తేను?"

"అలా అయితే లాంచీ లంకల దగ్గర ఆగినప్పుడు నిన్నుదింపేత్తాను" ఆ మాటిని ఆవిడ మరీ మరీ పొగిలి, పొగిలి ఏడవడం మొదలుపెట్టింది.

అప్పుడు ఎవరూ ఊహించని విధంగా చిన్న ఆకారం ముందుకొచ్చింది. "డబ్బులు నా కాడున్నాయి .. . ఇవిగో మూడ్రూపాయలు ... టికెటీ కొట్టెయ్" టాటా లెవెల్లో వాడి పోజూ, వాడూను. వచ్చాడు పెద్ద కరుణామయుడు. 'వాడంటే నాకదోరకం ఎలర్జీ. వాడినందరూ 'చిట్టి' అంటారు. లాంచీవాళ్ళకి ఆపనీ ఈపనీ చేస్తూ గోదారొడ్డునే ఎక్కువ జీవితం గడిపేస్తాడు. వాడికి తల్లి లేదు. వీడు పుట్టగానే చెట్టుక్రింద వదిలేసి, తల్లి లేచిపోయింది. ముక్కుక్రింద, నోటిచుట్టూ అశుభ్రత. ఆ నవ్వు ... పరమ ఛండాలంగా వుంది. అడ్డదిడ్డంగా ఆ పళ్ళు, వొంగ, హారిబుల్ వీడో దాత.' మనసులోనే చిరాకు పడ్డాను.

ఈ బొట్టెడు కాకుండా ఆ కాలేజీ అమ్మాయి ఇచ్చుంటే ఫైన్‌గా వుండేది.

గుడుగుడుమంటూ లాంచీ రాజమండ్రికి చేరుకుంది. జనం పాలోమని దిగిపోతున్నారు. అందరికంటే ముందు పరిగెత్తే చిట్టి అలానే వున్నాడు. నేను ఆ అమ్మాయి దర్శనాల్ని మిస్ అవకుండా జాగ్రత్త పడుతున్నా.

"ఏరా వెధవా ... అలా చూస్తావేం?" అందా అమ్మాయి.

వాడు ఆమె దగ్గరగా వెళ్ళాడు. వంగాడు. విసనకర్రలా పర్చుకున్న చీర కుచ్చిళ్ళ చాటునుంచి పది రూపాయల నోటు తీసాడు.

ఆ అమ్మాయి చీదరించుకుంటున్నట్లుగా మొహం పెట్టి "ఎలా వచ్చిందది?" అంటోంది.

**తాతనడుగు**

"మీకొచ్చిన జబ్బు మీది కాదు. నిజానికి అది మీకు వంశపారంపర్యంగా వచ్చిన జబ్బు" అన్నాడు డాక్టరు పేషంటుతో అన్ని పరీక్షలు చేసి.

"అయితే మీ ఫీజు మా తాతగారినడిగి తీసుకోండి" అని లేచి వెళ్ళిపోయాడు ఆ తెలివైన పేషెంటు.

– డా. యశస్వి



*వాడు వామనుడిలా ఎదిగిపోయినట్లు, నా అణువణువూ కుంచించుకు పోయినట్టు అనుభూతి. ఎవరు నేర్పారు వీడికీ సంస్కారం! జన్మనిబట్టి సంస్కారం కాదా?*

*అప్రయత్నంగా 'ఉప్పుకప్పురంబు ఒక్క పోలిక నుండు' పద్యం గుర్తుకొచ్చింది. ఇంతవరకూ విలువలు తారుమారుగా చూస్తూ వచ్చాను నేను. అవును, ఉప్పు కర్పూరం ఒక్కలానే వుంటాయి.*



కాని నేనూ చూశాను ఆ అమ్మాయి పాదంక్రింద నోటుని నొక్కిపెట్టిన విధానాన్ని. నిశ్చేష్టుడ్నయ్యాను.

"మీరు ఆ నోటీ మీద పాదమెట్టడం సూసానమ్మాయిగోరూ. మీరు సూసుకోకుండా. కూకున్నారని నా కెరికే. ఆ సంగతి అందరిముందూ సెప్తే ఎదవ మడ్సులు నానారకాలుగా కూత్తారు."

"నేను లేవగానే కొట్టేద్దామని నీ ప్లాన్" అలా అంటున్న ఆ పిల్లని చూస్తే నాకొళ్ళు మండిపోయింది. "రెండు రూపాయలిచ్చి, పది రూపాయలు కొట్టేస్తున్నావు. బుర్రంటే నీదిరా."

"దాని డబ్బులు నాకెందుకండీ? ముసిల్దానికి ఒక్కోరోజు గంజినీళ్ళు కూడా వుండవు. అలాటిదాని దగ్గర కొల్లుకుంటే పాపం" అంటూ ఆ నోటుని అవ్వకివ్వడానికి పరిగెత్తాడు.

కుంటికాలేసుకుని పరిగెడుతున్న వాడ్ని, ఇదంతా చూసిన పాపానికేమో ... నా వైపు మిర్రి, మిర్రి చూసి, లాంచీ దిగిపోయిందా అమ్మాయి.

ఆ మామ్మకి డబ్బిచ్చేసి, ఆవిడ దీవనలు పొంది... రెండు జీళ్ళను ఉదారంగా దానంచేసిన ఆవిడ్ని మెచ్చుకుంటూ... కాలెగరేసుకుంటూ లాంచీవైపు వస్తున్నాడు వాడు.

ముక్కుక్రింద, నోటిచుట్టూ అశుభ్రత ... ఆ చొంగ, ఆ నవ్వు... వేరే కోణంలో కనబడుతున్నాయి నాకు. పది రూపాయలు ఆ అమ్మాయి పాదంక్రింద నొక్కి పెట్టిందన్న సంగతి తెల్సీ, అది బైటపడకుండా మానేజ్ చెయ్యడం... ఎవరు నేర్పారు వీడికీ సంస్కారం? జన్మనిబట్టి సంస్కారం కాదా?

నాకు, వాడు వామనుడిలా ఎదిగిపోయినట్లు ... నా అణువణువు కుంచించుకుపోయినట్లు అనుభూతి. భారంగా అక్కడ్నించి కదిలాను:

అప్రయత్నంగా, 'ఉప్పు ... కప్పురంబు ఒక్క పోలికనుండు' పద్యం గుర్తుకొచ్చింది. ఇంతవరకు విలువలు తారుమారుచేస్తూ వచ్చాన్నేను. అవును ఉప్పూ, కర్పూరం ఒక్కలానే వుంటాయి.

